# ఆదిలాబాద్ వార్త

మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

సోమవారం 27, ఏప్రిల్ 2026




## బాసర అమ్మవారిని దర్శించుకున్న నూతన కలెక్టర్ భవేశ్ మిశ్రా

నిర్మల్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త

నిర్మల్ జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన భవేశ్ మిశ్రా ఆదివారం బాసరలోని ప్రసిద్ధ శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారిని దర్శించుకున్నారు. తన సతీమణి ఇలా త్రిపాఠితో కలిసి ఆలయానికి విచ్చేసిన ఆయనకు, ఆలయ ఈఓ, అధికారులు, అర్చకులు పూర్ణకుంభంతో సాదర స్వాగతం పలికారు. కలెక్టర్ దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. జిల్లా ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, విద్యార్థులు విద్యాభివృద్ధి సాధించాలని వారు అమ్మవారిని ప్రార్థించారు. పూజా కార్యక్రమాల అనంతరం వేద పండితులు కలెక్టర్ దంపతులకు వేద ఆశీర్వచనం చేయగా, ఆలయ అధికారులు అమ్మవారి తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందజేసి వారిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# జన గణనలో భాగంగా స్వీయ గణన ప్రారంభం



✳ మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

నస్పూర్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త

జనగణన 2027లో భాగంగా ఆదివారం స్వీయ గణన ప్రక్రియ ప్రారంభించడం జరిగిందని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. ఆదివారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్‌లో జనగణన అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జన గణనను 2 విడతలుగా నిర్వహించడం జరుగుతుందని, మొదటి విడతలో మే 11వ తేదీ నుండి జూన్ 9వ తేదీ వరకు ఇండ్ల గణన, 2వ విడతలో జనగణన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. డిజిటల్ సాంకేతికతను ఉపయోగించి నాణ్యమైన, స్పష్టమైన జాబితా రూపొందించడం జరుగుతుందని, ఇందు కొరకు ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లకు తగు శిక్షణ అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ నెల 26వ తేదీ నుండి మే 10వ తేదీ వరకు స్వీయ గణన జరగనున్న నేపథ్యంలో ఆదివారం కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందని, తాను వివరాలను పోర్టల్‌లో నమోదు చేశానని, జిల్లాలో దాదాపు 1 వేయి మంది తమ వివరాలను నమోదు చేశారని తెలిపారు. స్వీయ గణన కార్యక్రమం నిర్వహణలో ప్రజా ప్రతినిధులు, మిగతా 2లో..

# వడ్లు కొనండి సారూ..!

ప్రారంభం కాని కొనుగోలు కేంద్రాలు ● సెంటర్ల వద్ద అన్నదాతల పడిగాపులు

చెన్నూరు, ఏప్రిల్ 26, ప్రభాతవార్త



రైతులు తాము వేసంగిలో పండించిన వరి పంటను వెంటనే కొనుగోలు జరపాలని అధికారులను కోరుతున్నారు. మంచిర్యాల జిల్లా చెన్నూరు మండల వ్యాప్తంగా వడ్ల కొనుగోలు కేంద్రాలను అధికారులు ఇంకా ప్రారంభించక పోవడంతో కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు నిరీక్షిస్తున్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ వర్షాకాలంలో పంట దిగుబడి రాకపోవడంతో తీవ్రంగా నష్టపోయామని, వేసంగి పంట దిగుబడి ఫర్వాలేదని అన్నారు. సెంటర్లలో వడ్లు పోసి పది రోజులు అవుతున్నా అధికారులు కొనుగోలు ప్రారంభించక పోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. వేసంగిలో వడగండ్ల వానలు కురిసినట్లైతే తీవ్రంగా నష్టపోతామని, ఎండలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, సంబంధిత అధికారులు కొనుగోలు కేంద్రాలను త్వరితగతిన ప్రారంభించి వడ్ల కొనుగోళ్లు చేపట్టాలని రైతులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

# తెలంగాణ అంటే కేసీఆర్.. కేసీఆర్ అంటే తెలంగాణ



✳ చెన్నూర్ మాజీ శాసనసభ్యుడు బాల్క సుమన్

క్యాతన్‌పల్లి, ఏప్రిల్ 26, ప్రభాతవార్త

14 ఏండ్ల సుధీర్ఘ పోరాటం చేసి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన కేసీఆర్ మర మనిషి కాదని, తెలంగాణ అంటే కేసీఆర్, కేసీఆర్ అంటే తెలంగాణ అని బిఆర్ఎస్ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు, చెన్నూర్ మాజీ శాసనసభ్యులు బాల్క సుమన్ అన్నారు. క్యాతన్‌పల్లి మున్సిపల్ చైర్మన్ ఎన్నిక సమయంలో నమోదు అయిన నేపథ్యంలో కండిషనల్ మిగతా 2లో..

# వైభవంగా పరమ శివుడి విగ్రహావిష్కరణ



ఆసిఫాబాద్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త

ధ్యాన పరమ శివుడి విగ్రహ అవిష్కరణను రావుల పరివార్ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఆదివారం ఆసిఫాబాద్ పట్టణం పెద్దవాగు ఉత్తర నదీ తీరాన ఏర్పాటు చేసిన 10 అడుగుల ఆదియోగి ధ్యాన పరమ శివుడి విగ్రహ అవిష్కరణ హైదరాబాద్కు చెందిన సంస్కృతాంధ్ర పండితులు, అష్టావధాని ముత్యంపేట గౌరీ శంకర శర్మ, అర్చకులు చందావార్ శ్రీధర్, బాలేశ్వర్ ఆధ్వర్యంలో రావుల కుటుంబీకులు అవిష్కరించారు. ఉదయం స్థానిక వాసవీ మందిరం నుండి బాలేశ్వర ఆలయం వరకు పరమ శివుడి. చిత్రపటంతో బ్యాండ్ మేళాలతో శోభాయత్రగా తరలివచ్చారు. ఆలయానికి ఉత్తరాన ఉన్న నది నుండి నీటిని తెచ్చి వేద మంత్రాల నడుమ శివుడికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వేద పండితులు. గౌరీ శంకర శర్మ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని ఉత్తర వాహిణీ నదీ తీరాన పరమ శివుడి విగ్రహ ఆవిష్కరణ ఆలయ వాతావరణాన్ని మరింత ఆధ్యాత్మికంగా మార్చడమే కాకుండా ప్రాంతీయ సంస్కృతి, పురాతత్వ వారసత్వానికి బలమైన చిహ్నంగా నిలిచిందన్నారు. విగ్రహ ఏర్పాటుతో దేవాలయం ఒక పుణ్యక్షేత్రంగా మరింత ప్రసిద్ధి చెందుతుందన్నారు. ఈ సందర్భంగా పట్టణానికి చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పరమ శివుడిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య ప్రముఖులు, రావుల కుటుంబ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# జన గణనలో భాగంగా స్వీయ గణన ప్రారంభం

**(మొదటిపేజీ తరువాయి)**

ప్రభుత్వ ఉద్యోగులు, ప్రముఖ వ్యక్తులు, గణన అధికారులు, యువత, స్వయం సహాయక సంఘాల ద్వారా ప్రజలందరికీ తెలిసేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. జిల్లా స్థాయి జనగణన అధికారులు ప్రతిరోజు స్వీయ గణన వివరాలను నవీకరించాలని తెలిపారు. జిల్లాలోని అన్ని మండలాలు, గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీలలో స్వీయ గణనపై ప్రజలందరికీ తెలిసే విధంగా విస్తృత ప్రచారం నిర్వహించాలని తెలిపారు. జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు స్వీయ గణన కార్యక్రమ కార్యచరణను పకడ్బందీగా అమలు చేయాలని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల అమలు జనాభా ప్రాతిపదికన చేపట్టడం జరుగుతుందని, ఈ క్రమంలో స్పష్టమైన జాబితా రూపొందించేందుకు జిల్లా ప్రజలు సహకరించాలని తెలిపారు. మే 10వ తేదీ వరకు ఆన్ లైన్ లో https://sc.census.gov.in వెబ్ సైట్ ద్వారా స్వీయ గణన చేసుకోవచ్చని, ఒక కుటుంబానికి ఒకే మొబైల్ నెంబర్ వినియోగించాలని, ఇండ్ల గణనకు సంబంధించి 33 ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చి రివ్యూ ద్వారా పరిశీలించుకోవాలని తెలిపారు. పూర్తి వివరాలు నింపిన తరువాత సబ్మిట్ చేయడంతో హెచ్ అక్షరంతో ప్రారంభమయ్యే 11 అంకెల సంఖ్యతో ఐ.డి. వస్తుందని, ఈ సంఖ్యను నమోదు చేసి భద్రపరచుకోవాలని తెలిపారు. మే 11వ తేదీ నుండి ఇండ్ల గణన అధికారులు కార్యక్రమంలో భాగంగా ఇంటికి వచ్చినప్పుడు ఈ నెంబర్ ను అందించాలని తెలిపారు. ఆ సమయంలో ఏమైనా మార్పులు ఉన్నట్లయితే ఎన్యుమరేటర్ ద్వారా సవరించుకోవచ్చని తెలిపారు. జన గణన కొరకు అధికారులు వచ్చిన సమయంలో ప్రజలు వాస్తవ సమాచారాన్ని అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



36వ డివిజన్‌లో ఇందిరమ్మ ఇంటిని ప్రారంభిస్తున్న కొక్కిరాల సురేఖ

# అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందజేస్తాం

**- మాజీ డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ**

**- మంచిర్యాల 36వ డివిజన్‌లో నూతన గృహ ప్రవేశం**

**నస్పూర్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త**

ప్రభుత్వ లక్ష్యం ప్రకారం అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందజేసి వారి సొంతింటి కలను నెరవేరుస్తామని జిల్లా మాజీ డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ స్పష్టం చేశారు. మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 36వ డివిజన్‌లో నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటి గృహ ప్రవేశ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై, రిబ్బన్ కట్ చేసి ఇంటిని ప్రారంభించి లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఈ సందర్భంగా ఆమె పేర్కొన్నారు. నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా గృహ నిర్మాణ పథకానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో పాల్గొన్న సురేఖను లబ్ధిదారులు శాలువాతో ఘనంగా సన్మానించారు. తమకు నీడ కల్పించినందుకు ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావుకు, సురేఖకు లబ్ధిదారులు ధన్యవాదాలు తెలియజేశారు. ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం అందుబాటులో ఉంటామని నాయకులు ఈ సందర్భంగా భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ విద్య

**ఆసిఫాబాద్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త :**



కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అందించడం జరుగుతుందని స్కూల్ కాంప్లెక్స్ రీసోర్స్ పర్సన్, పర్యవేక్షణ అధికారి రాథోడ్ రవీందర్ పేర్కొన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఆసిఫాబాద్ బాలికల ఆశ్రమ పాఠశాల స్కూల్ కాంప్లెక్స్ ఫరిదిలోని పలు గ్రామాలలో తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం ప్రజా పాలనా 99 రోజుల కార్యక్రమంలో భాగంగా బడిబాట నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ కాంప్లెక్స్ రీసోర్స్ పర్సన్, పర్యవేక్షణ అధికారి సిబ్బందితో కలిసి ఇంటింటికి వెళ్లి బడీడు పిల్లలను పాఠశాలలో చేర్పించే విధంగా పిల్లల తల్లితండ్రులను అవగాహన కల్పించారు. ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన ఆంగ్ల మాధ్యమంలో విద్య అందిస్తూ విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, రెండు జతలు ఏకరూప దుస్తులు, సన్నబియ్యంతో భోజనం, ఆట పాటలతో విద్య అందించడమే కాకుండా విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి అన్ని విధాలా జాగ్రత్తలు తీసుకోవడం జరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో మొవాడ్ ఎస్సి ఆర్పి కూడ్మేత అనంత్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కుంరం మాధవరావ్, ఉపాధ్యాయులు ఆత్రం తిరుపతి, మార్సుకోల రంజిత్, వట్టివాగు గ్రామ పటేల్ మాజీ ఎంపిటీసి ఉయిక శంకర్, విద్యార్థుల తల్లితండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# రెండవ రోజు మార్నింగ్ వాక్..

**● కాండ్లి తండా సమస్యల పరిష్కారానికి సర్పంచ్ హామీ**

**నిర్మల్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:**

నిర్మల్ రూరల్ మండలం రత్నాపూర్ కాండ్లి గ్రామ పంచాయతీ పరిధిలో రెండవ రోజు మార్నింగ్ వాక్ కార్యక్రమం ఆదివారం ఉత్సాహంగా కొనసాగింది. గ్రామ సర్పంచ్ గడ్డం హరీష్ ఆధ్వర్యంలో కాండ్లి తండా కాలనీలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. తండా కాలనీలో పర్యటించిన సర్పంచ్ స్థానికులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడం, కరెంటు స్తంభాల సమస్యతో తండావాసులు ఇబ్బందులు పడుతున్నట్లు సర్పంచ్ దృష్టికి తీసుకొచ్చారు. సమస్యలను విన్న సర్పంచ్ గడ్డం హరీష్ స్పందిస్తూ, తండావాసులు ఎదుర్కొంటున్న డ్రైనేజీ, కరెంటు స్తంభాల సమస్యలను నెల రోజుల్లోగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అధికారులతో మాట్లాడి వెంటనే పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ మార్నింగ్ వాక్ కార్యక్రమంలో సర్పంచ్‌తో పాటు ఉపసర్పంచ్, వార్డు మెంబర్లు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం సర్పంచ్ హరీష్ మాట్లాడుతూ, తమతో కలిసి వచ్చిన ఉప సర్పంచ్, వార్డు సభ్యులకు, సహకరించిన తండావాసులకు ధన్యవాదాలు తెలిపారు. ప్రజా సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకునేందుకే మార్నింగ్ వాక్ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. గ్రామ సర్పంచ్ స్వయంగా కాలనీల్లో పర్యటించి సమస్యలను తెలుసుకోవడంపై తండావాసులు హర్షం వ్యక్తం చేశారు.



సమస్యలు తెలుసుకుంటున్న సర్పంచ్ గడ్డం హరీష్

# తెలంగాణ అంటే కేసీఆర్.. కేసీఆర్ అంటే తెలంగాణ

**(మొదటిపేజీ తరువాయి)**

బెయిల్‌లో ఉన్న ఆయన ఆదివారం రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్‌లో సంతకం చేశారు. అనంతరం క్యాతన్‌పల్లి మున్సిపల్ చైర్ పర్సన్ గోడిశెల సంధ్యారాణి, బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు కంభగోని సుదర్శన్ గౌడ్‌లతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు.ఎవరైనా పార్టీలు ఏర్పాటు చేసుకోవచ్చని, పార్టీలు పెట్టె వారు ఏ ఉద్దేశ్యంతో పార్టీలు పెడుతున్నారో అని ప్రజలు అన్ని గమనిస్తున్నారని అన్నారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల, ముఖ్య మంత్రి, ప్రధాన మంత్రిలను విమర్శించకుండా, ప్రధాన ప్రతిపక్ష నాయకుడైన కేసీఆర్‌ను విమర్శించడం సరికాదని అన్నారు.

# ఘనంగా శ్రీ వాసవి మాత జయంతి ఉత్సవాలు



**నస్పూర్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త**

శ్రీ వాసవి మాత జయంతి ఉత్సవాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్న నేపథ్యంలో జిల్లాలో ఘనంగా వేడుకలు నిర్వహించడం జరిగిందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని విశ్వనాథ ఆలయంలో ఏర్పాటు చేసిన శ్రీ వాసవి మాత జయంతి ఉత్సవాలకు సతీ సమేతంగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆర్యవైశ్యుల కులదైవం అయిన శ్రీ వాసవి మాత జయంతి వేడుకలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఉదయం కుంకుమ పూజ, సాయంత్రం ఊరేగింపు, పవళింపు సేవ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని తెలిపారు. ఆలయానికి విచ్చేసిన జిల్లా కలెక్టర్ దంపతులకు దేవాదాయ శాఖ అధికారి, ఆలయ అర్చకులు, ఆర్యవైశ్య ప్రముఖులు స్వాగతం పలికారు. జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన శ్రీ వాసవి జయంతి వేడుకలకు కలెక్టరేట్ పరిపాలన అధికారి పిన్న రాజేశ్వర్, జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి చాతరాజుల దుర్గాప్రసాద్, జిల్లా యువజన క్రీడా సేవల అధికారి హనుమంత రెడ్డి, ఈ డిస్ట్రిక్ట్ మేనేజర్ సునీల్, ఆర్యవైశ్య ప్రముఖులు సిరిపురం రాజేశం, కటకం హరీష్, చిలువేరు శ్రీనివాస్, ముక్త శ్రీనివాస్, మాదంశెట్టి సత్యనారాయణ, కొత్త రాజేశం, కేశెట్టి వంశీకృష్ణ, వాసవి క్లబ్ మంచిర్యాల ప్రతినిధులు హాజరై శ్రీ వాసవి మాత చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ఆర్యవైశ్య ప్రముఖులు, వాసవి క్లబ్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

**ఆసిఫాబాద్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త :**

వాసవిమాత జయంతి వేడుకలను ఆలయ అభివృద్ధి కమిటి, వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ఆర్యవైశ్యులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆదివారం ఆసిఫాబాద్ పట్టణంలోని శ్రీ వాసవి కన్యాకాపరమేశ్వరి ఆలయంలో అర్చకుడు రాజశేఖర్ శర్మ వాసవిమాత విగ్రహాన్ని ప్రత్యేకంగా పుష్పాలతో అలంకరించారు. ఉదయం నుంచే ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణంలో నిర్వహించిన కుంకుమ పూజల్లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్యులు మాట్లాడుతూ వాసవిమాత త్యాగం, అహింసా సిద్ధాంతంపై ప్రస్తావించారు. సమాజంలో ఐక్యత, ధర్మబద్ధ జీవనం, సేవా భావం పెంపొందించుకోవాలన్నారు. వాసవిమాత జయంతి వేడుకలు పురస్కరించుకొని సాయంత్రం పట్టణంలోని పలు విధుల గుండా మహిళల కోలాటం నడుమ అమ్మవారి ఉత్సవ విగ్రహంతో శోభయాత్ర నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు మహాన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు రావుల శంకర్, వెంకన్న, మురళి, చిలివేరి వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, పాత శ్రీనివాస్, గుండా ప్రమోద్, ప్రశాంత్, విజయ్, వేణుగోపాల్, వాసవి క్లబ్ కార్యదర్శి శ్రీనివాస్, మహిళలు తదితరులు పాల్గొన్నారు. అధికారికంగా వాసవిమాత జయంతి వేడుకలు...వాసవిమాత జయంతి వేడుకలు అధికారికంగా నిర్వహించాలని ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారిచేశారు. దీనిలో భాగంగా ఆదివారం జిల్లాకేంద్రంలోని స్థానిక మార్కెట్ కార్యాలయంలో జిల్లా టూరిజం ఆధ్వర్యంలో మార్కెట్ కమిటి చైర్మన్ మంగ, జిల్లా అధికారి అశ్వక్ అహ్మద్ సమక్షంలో వాసవిమాత జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి చిత్ర పటానికి పూలమాలలు వేశారు. అనంతరం వారు మాట్లాడుతూ వాసవి సభ్యులు ఐక్యత, సేవా భావాలకు ప్రతీకగా నిలుస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్యులు ఎకిరాల శ్రీనివాస్, వేణుగోపాల్, విజయ్, రవి, ప్రశాంత్ సిబ్బంది పాల్గొన్నారు.

**తాండూర్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త :**

తాండూర్ మండలంలోని తంగళ్ళపల్లి శ్రీ వాసవి కన్యక పరమేశ్వరి దేవాలయంలో ఆదివారం శ్రీ వాసవి మాత జయంతి వేడుకలను ఆర్య వైశ్యులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాసవి మాతకు వేద పండితులు గణేష్ శర్మ మాధవి దంపతుల ఆధ్వర్యంలో అభిషేకము, అర్చన, కుంకుమ పూజలు చేశారు. వాసవి మాత, వాసవి చాలీసా, వాసవి మణిదీప వర్ణన మహిళలు పారాయణం చేశారు. అనంతరం ఆలయ అన్న ప్రసాద వితరణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

**పెంచికల్ పేట్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త :**

మండల కేంద్రంలోని ఎల్కపల్లి కోదండ రామాలయంలో ఆదివారం వాసవి మాత జయంతి వేడుకలను ఆర్యవైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి కుంకుమ పూజతో పాటు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో అధ్యాత్మిక వాతావరణం నెలకొంది. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం మహిళా సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

**జన్నారం, ఏప్రిల్ 26, ప్రభాతవార్త**

ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవం,కుల దైవమైన శ్రీ వాసవి మాతకు ఆర్యవైశ్య సంఘం నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. మండల కేంద్రంలోని శ్రీ అభయాంజనేయ సహిత మహాలక్ష్మి దేవాలయంలో వాసవి మాత జయంతిని పురస్కరించుకుని ఆదివారం ఉదయం పురోహితులు గుండి గణేష్ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి అర్చనలు,అభిషేకాలు చేశారు.అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. దీంతో ఆలయ పరిసరాల్లో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో పొనకల్ సర్పంచ్ జక్కు సుష్మ భూమేష్,ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షులు జక్కు భూమేష్, సెక్రటరీ గోపాలకృష్ణ,వర్తక సంఘం అధ్యక్షుడు వోజ్జల వామన్, ప్రధాన కార్యదర్శి జక్కు రమేష్ కోశాధికారి కొమరవెల్లి శివరామకృష్ణ, మహాలక్ష్మి ఆలయ కమిటీ అధ్యక్షుడు జక్కు సత్తయ్య,నాయకులు గుండ లచ్చన్న, గుండ సుధాకర్, కొమురవెల్లి లచ్చన్న, పద్మ నారాయణ గోలిచందు, అక్కెనపల్లి శ్రీను, నాగేష్, శ్రీహరి, వెంకటేష్, ఆర్యవైశ్య మహిళలు పాల్గొన్నారు.

**నిర్మల్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:**

జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఆదివారం వాసవి మాత జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో భాగంగా అదనపు కలెక్టర్ పలువురు అధికారులు, సంఘాల నాయకులతో కలిసి వాసవి మాత చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాసవి మాత చూపిన త్యాగనిరతి, ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. మహిళా శక్తికి ఆమె నిదర్శనమని కొనియాడారు. ఈ జయంతి వేడుకల్లో డీవైఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి, జిల్లా పరిశ్రమల మేనేజర్ నరసింహారెడ్డి, వివిధ సంఘాల నాయకులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

**లక్షెట్టిపేట, ఏప్రిల్ 26, ప్రభాతవార్త**

పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆదివారం ఆర్యవైశ్య సంఘం, వాసవి మాత ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి జయంతిని ప్రభుత్వ పండగలో చేర్చినందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా వాసవి మాత విగ్రహానికి అభిషేక కార్యక్రమం నిర్వహించి, మహిళలచే కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయం ఆవరణలో ముఖ్యమంత్రి చిత్రపటానికి ఆర్యవైశ్యులందరూ పాలాభిషేకం చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన తాసిల్దార్ దిలీప్ కుమార్ మాట్లాడుతూ... ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవమైన వాసవి మాత జయంతిని ప్రభుత్వ వేడుకగా జరుపడం ఆనందంగా ఉందన్నారు. వాసవి మాత ఆశీస్సులతో అందరూ సుఖశాంతులతో ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షుడు నల్మాస్ కాంతయ్య, జిల్లా అధ్యక్షులు కొత్త వెంకటేశ్వర్లు, పట్టణ అధ్యక్షులు చెట్ల రమేష్, మున్సిపల్ కౌన్సిలర్ మైలారపు సుధాకర్, మంచిర్యాల జిల్లా వైశ్య సంఘం మహిళా ప్రధాన కార్యదర్శి నరేందుల సాహితి, యువజన సంఘం అధ్యక్షుడు గడ్డం వికాస్, నాయకులు నల్మాస్ శ్రీనివాస్, ఒజ్జల శ్రీనివాస్, పాలకుర్తి రామన్న, లచ్చన్న, మహేందర్, కొంజర్ల శ్రీనివాస్, గంప రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



వాసవి మాత చిత్రపటానికి పూలమాల వేస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు



శ్రీ వాసవి మాత జయంతి వేడుకలలో పాల్గొన్న మహిళలు



అభిషేకం నిర్వహిస్తున్న ఆర్యవైశ్యులు



అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న మహిళలు







సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఆర్యవైశ్యులు

## సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

**పెంచికల్ పేట్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త :**

వాసవి మాత జయంతిని రాష్ట్ర పండుగగా గుర్తించినందుకు తెలంగాణ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ పెంచికల్ పేట్ మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, గుర్తింపుకు కృషిచేసిన ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కల్వ సుజాత గుప్త చిత్రపటాలకు పాలాభిషేకం చేసి తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ వాసవి మాత జయంతికి రాష్ట్ర పండుగ హోదా కల్పించడంతో ఆర్యవైశ్యుల దీర్ఘకాల డిమాండ్ నెరవేరినట్టేనని తెలిపారు. నిర్ణయం సమాజానికి గౌరవాన్ని తీసుకువచ్చిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం సభ్యులు, మహిళా సభ్యులు, యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.



సర్వేలో మొదటగా వివరాలు నమోదు చేసుకున్న ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ భోజ్జు

## స్వీయ గణన సర్వేను పారదర్శకంగా నిర్వహించాలి

**ఉట్నూర్, ఏప్రిల్ 26,ప్రభాతవార్త :**

మండలంలోని ఘన్పూర్ పంచాయతీలో గల ఎమ్మెల్యే సొంత గ్రామమైన కల్లూరిగూడలో స్వీయ జన గణనను అధికారుల సమక్షంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఆదివారం ప్రారంభించారు. సెల్ఫ్ ఎన్యూమరేషన్ సర్వేలో మొదటి పేరును ఖానాపూర్ ఎమ్మెల్యే వెడమ్మ బొజ్జు పటేల్ అధికారుల సమక్షంలో స్వయంగా నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వీయ గణన సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని. ఈ సర్వే నమోదులో తమ మొబైల్ లోని డాటా ద్వారా వివరాలు నమోదు చేసుకుని వచ్చారని ఆయన అన్నారు.

## జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక

**లక్షెట్టిపేట, ఏప్రిల్ 26, ప్రభాతవార్త**

లక్షెట్టిపేటలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినులు సబ్ జూనియర్ జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక అయినట్లు ప్రిన్సిపల్ కె. రమా కల్యాణి తెలిపారు. తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల డిసెంబర్ 6, 7 తేదీల్లో పెద్దపల్లి జిల్లాలో నిర్వహించినటువంటి రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ సాఫ్ట్ బేస్బాల్ పోటీలో పాల్గొన్న విద్యార్థినులు ఎం. నిహారిక, ఎల్. అక్షయ, బి. హనీ శ్రీ, కె. తేజస్వీలు మంచి ప్రతిభ కనబర్చి సబ్ జూనియర్స్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక అయ్యారని ప్రిన్సిపాల్ తెలిపారు. వారు ఈ నెల 26 నుంచి 28 వరకు జరిగే సబ్ జూనియర్స్ జాతీయ స్థాయి సాఫ్ట్ బేస్బాల్ పోటీలు పాల్గొనబోతున్నారని, ఈ సందర్భంగా పిఈటి డి. రమాదేవి, సిహెచ్. మమతలను ప్రిన్సిపల్, పాఠశాల సిబ్బంది అభినందించారు.



# డిజిటల్ సాంకేతికతతో నాణ్యమైన జాబితా రూపొందించాలి

**- అదనపు కలెక్టర్ డేవిడ్**

**ఆసిఫాబాద్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త :**

జనగణన 2027లో భాగంగా స్వీయ గణన ప్రక్రియ నిర్వహణపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా అదనపు కలెక్టర్ డేవిడ్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలోని జిల్లా కలెక్టర్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జన గణనను 2 విడతలుగా నిర్వహించడం జరుగుతుందని, మొదటి విడతలో మే 11 నుండి జూన్ 9 వరకు ఇండ్ల గణన, 2వ విడతలో జనగణన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. డిజిటల్ సాంకేతికతను ఉపయోగించి నాణ్యమైన, స్పష్టమైన జాబితా రూపొందించడం జరుగుతుందని, ఇందు కొరకు ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లకు తగు శిక్షణ అందించడం జరుగుతుందని తెలిపారు. స్వీయ గణన కార్యక్రమం నిర్వహణలో ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులు, ప్రముఖ వ్యక్తులు, గణన అధికారులు, యువత, స్వయం సహాయక సంఘాల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ నెల 26 నుండి మే 10 వరకు స్వీయ గణన పోర్టల్ అందుబాటులో ఉంటుందని, జిల్లా స్థాయి జనగణన అధికారులు ప్రతిరోజు స్వీయ గణన వివరాలను నవీకరించాలని తెలిపారు. జిల్లాలోని అన్ని మండలాలు, గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీలలో స్వీయ గణనపై ప్రజలందరికీ తెలిసే విధంగా విస్తృత ప్రచారం నిర్వహించాలని తెలిపారు. జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు స్వీయ గణన కార్యక్రమ కార్యచరణను పకడ్బందీగా అమలు చేయాలని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల అమలు జనాభా ప్రాతిపదికన చేపట్టడం జరుగుతుందని, ఈ క్రమంలో స్పష్టమైన జాబితా రూపొందించేందుకు జిల్లా ప్రజలు సహకరించాలని తెలిపారు. ఈ నెల 26 నుండి మే 10 వరకు ఆన్ లైన్ లో https://sc.census.gov.in వెబ్ సైట్ ద్వారా స్వీయ గణన చేసుకోవచ్చని, జనగణలో భాగంగా అధికారులు ఇంటికి వచ్చినప్పుడు స్వీయ గణన ఐడి అందించవచ్చని తెలిపారు. జన గణన కొరకు అధికారులు వచ్చిన సమయంలో ప్రజలు వాస్తవ సమాచారాన్ని అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య ప్రణాళిక అధికారి కార్యాలయ సిబ్బంది, మాస్టర్ ట్రైనర్లు, ఫీల్డ్ ట్రైనర్లు, సాంకేతిక సహాయకులు పాల్గొన్నారు.



డిజిటల్ సాంకేతికతను చూపుతున్న జిల్లా అదనపు కలెక్టర్ డేవిడ్

# ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌కు ఘన సన్మానం

**నేరడిగొండ, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:**

అమెరికన్ యూనివర్సిటీ నుండి గౌరవ డాక్టరేట్ అందుకున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆదివారం నియోజకవర్గానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా నేరడిగొండ మండల నాయకులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యేకు శాలువా కప్పి ఘనంగా సన్మానించి, పూల బొకేలను అందజేశారు. అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి ప్రజా ప్రతినిధులు, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



# పిల్లల భవిష్యత్తు, ఆరోగ్యం మనందరి బాధ్యత

**- ప్రజా ట్రస్ట్ చైర్మన్ మోహన్ రావు పాటిల్**

**భైంసా, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:**

పాఠశాలలకు వేసవి సెలవులు ప్రారంభమైన నేపథ్యంలో పిల్లల భవిష్యత్తు, ఆరోగ్యం పట్ల తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరించాలని ప్రజా ట్రస్ట్ చైర్మన్ మోహన్ రావు పాటిల్ కోరారు. ఆదివారం భైంసా మండల కేంద్రంలో ఆయన తల్లిదండ్రులకు, విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఎండలు తీవ్రంగా ఉన్నందున పిల్లలు ఎండదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని విన్నవించారు. మధ్యాహ్నం వేళల్లో పిల్లలను ఎండలో తిరగనివ్వకూడదని, ఎక్కువగా నీరు, పండ్ల రసాలు తాగేలా చూడాలని సూచించారు. ఈతకు వెళ్లేటప్పుడు లేదా ఆరుబయట ఆడుకునేటప్పుడు ప్రమాదాలు జరగకుండా పెద్దల పర్యవేక్షణ తప్పనిసరిగా ఉండాలన్నారు. సెలవుల్లో కేవలం ఆటలకే పరిమితం కాకుండా, ప్రతిరోజూ కనీసం ఒక గంట పుస్తకాలు చదివేలా పిల్లలను ప్రోత్సహించాలని ఆయన కోరారు. పిల్లల ఉజ్వల భవిష్యత్తు కోసం అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని ఈ సందర్భంగా పేర్కొన్నారు.



# ఎస్సీ కార్పొరేషన్ అభ్యర్థులకు ఇంటర్వ్యూ

**తాండూర్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త :**

ఎస్సీ కార్పొరేషన్ రుణాలు కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈనెల 28న తాండూర్ ఎంపీడీవో కార్యాలయంలో ఉదయం 10 గంటలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు. ఇదివరకే ఆన్లైన్ లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు బ్యాంకు అధికారులు, కమిటీ సభ్యులు అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని తెలిపారు. అభ్యర్థులు సకాలంలో అన్ని ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలని ఆయన కోరారు.

# ప్రజల దాహార్తిని తీర్చడమే మా లక్ష్యం

## మాజీ డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ - మంచిర్యాల నియోజకవర్గంలో ఉచిత అంబలి కేంద్రాలు ప్రారంభం

**నస్పూర్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త**

వేసవి తాపం నుంచి ప్రజలకు ఉపశమనం కలిగించి వారి దాహార్తిని తీర్చడమే మా ప్రధాన లక్ష్యం అని మాజీ డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ పేర్కొన్నారు. ఆదివారం మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో కొక్కిరాల రఘుపతి రావు చారిటబుల్ ట్రస్ట్ ద్వారా మంచిర్యాల శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత అంబలి పంపిణీ కేంద్రాలను ఆమె ప్రారంభించారు. స్థానిక శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రాలు వేసవి కాలం పొడవునా సామాన్యులకు సేవలు అందిస్తాయి. తీవ్రమైన ఎండల దృష్ట్యా పాదచారులు, కార్మికులు, ప్రయాణికుల సౌకర్యార్థం ఈ నిర్ణయం తీసుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మంచిర్యాల బస్టాండ్, మార్కెట్ ప్రాంతం, ఐబీ చౌరస్తా, హమాలీవాడ, సిసిసి కార్నర్, శ్రీరాంపూర్ కాలనీ వంటి కీలక కూడళ్లలో ఈ కేంద్రాలను అందుబాటులోకి తెచ్చారు.



ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని నాణ్యమైన అంబలిని పంపిణీ చేస్తున్నట్లు ప్రారంభోత్సవ సందర్భంగా వెల్లడించారు. వేసవిలో వడదెబ్బ తగలకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సేవా దృక్పథంతో ట్రస్ట్ నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాలను ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ సల్ల రమ్య, కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, మహిళా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



నూతన వధూవరాలను ఆశీర్వదిస్తున్న మాజీ ఎమ్మెల్యే భోస్లే నారాయణరావు పాటిల్

## వివాహ వేడుకలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే నారాయణరావు పాటిల్

**భైంసా, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:**

ధర్మబాద్‌లోని గంగా సిటీ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించిన వివాహ వేడుకకు మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ భోస్లే నారాయణరావు పాటిల్ హాజరయ్యారు. ఎల్వాత్ గ్రామానికి చెందిన అశోక్ పాటిల్ కదం కుమార్తె శృష్టి, అవధూత వివాహ కార్యక్రమానికి విచ్చేసిన ఆయన, నూతన వధూవరాలను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శంకర్ చంద్ర రామచంద్ర రెడ్డి, మాజీ సొసైటీ చైర్మన్ శ్యామ్ రావు పాటిల్, పాండురంగ పటేల్, శంకర్ పాటిల్, శెట్టి పాటిల్, షేక్ సాజిత్, మాధవ్ రావు పాటిల్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఐదు రోజుల అంతర్జాతీయ ఉపాధ్యాయుల ఎక్స్పోజర్ విజిట్ విజయవంతం

### - ఫిన్లాండ్ పర్యటన విజయవంతంగా ముగించుకుని ఇండియాకు తిరిగి వచ్చిన ఉపాధ్యాయులు

**జన్నారం, ఏప్రిల్ 26, ప్రభాతవార్త**

ఫిన్లాండ్ దేశంలోని ప్రపంచ స్థాయి బోధన పద్ధతుల అధ్యయనం కోసం తెలంగాణ రాష్ట్రం నుండి ఫిన్లాండ్ వెళ్లిన ఐదుగురు ఉపాధ్యాయ బృందం విజయవంతంగా ఆ దేశ పర్యటన ముగించుకుని ఇండియాకు తిరిగి వచ్చారు. ఇందులో జన్నారం మండలం నుండి ఇద్దరు ఉపాధ్యాయులు జిల్లా పరిషత్ కిష్టాపూర్ స్కూల్ నుండి దాముక కమలాకర్, ప్రాథమిక పాఠశాల అక్కపెల్లి గూడెం నుంచి జాజలా శ్రీనివాస్ ఉన్నారు. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ ఫిన్లాండ్ దేశంలో ఐదు రోజుల అంతర్జాతీయ విద్యా విధానం అధ్యయనాన్ని విజయవంతంగా పూర్తిచేయడం చాలా ఆనందంగా ఉందని అన్నారు.విద్యార్థులకు అనువైన పాఠశాల విద్యా ప్రణాళికలను ఉపాధ్యాయులచే తయారు చేసి ఎలాంటి ఒత్తిడి లేకుండా తక్కువ హోం వర్క్ ఎక్కువ ప్రాక్టికల్స్ విధానంతో విద్యాబోధన చేస్తారని, దానిని సరళంగా అర్థం చేసుకుని ఎలాంటి ఒత్తిడికి గురి కాకుండా అన్ని విషయాలను సులభంగా నేర్చుకుంటారని అన్నారు. ప్రపంచ వ్యాప్త సర్వేలలో అగ్రస్థానంలో నిలిచిన ఫిన్లాండ్ భోధన వ్యవస్థ రహస్యాలను, విద్యార్థుల కేంద్రీకృత భోధన పద్ధతులు,, బోధకుల శిక్షణ విధానాలు, పాఠశాల విద్య, వృత్తి శిక్షణా వ్యవస్థలను అధ్యయనం చేశామని తెలిపారు. దేశంలోని ఐదు ప్రముఖ పాఠశాలలను సందర్శించి విద్యార్థుల సృజనాత్మకత, సమస్యల పరిష్కారం శక్తి, స్వీయ తత్వాన్ని పెంపొందించే పద్ధతులు, తదితర అంశాలు అధ్యయనం చేశామని తెలిపారు. ముఖ్యంగా వారి భోధన వ్యవస్థల్లో కొన్ని విద్యార్థి కేంద్రీకృత విద్య, బోధకులకు అధిక గౌరవం, సమానత్వ బోధన వ్యవస్థ అంటే అన్ని పాఠశాలల్లో ఒకే స్థాయి బోధన నాణ్యత, ప్రైవేట్ పాఠశాలలు చాలా తక్కువ, పాఠశాల కేంద్రీకృత కరికులం, విద్యాబోధన లో ఉపాధ్యాయునికి సంపూర్ణ స్వేచ్ఛ ఇలా అన్ని రకాల భోధన స్థాయి పటిష్టంగా ఉందని అన్నారు. ఈ అనుభవం తెలంగాణ విద్యా వ్యవస్థకు అమూల్య మార్గదర్శకంగా ఉంటుందని అన్నారు. అక్కడి పాఠశాలలు, శిక్షణా కేంద్రాలు విద్యను కేవలం పుస్తక జ్ఞానంగా కాకుండా జీవిత నైపుణ్యంగా, విలువలతో కూడిన అభ్యాసంగా మలచిన విధానం ఎంతో ప్రేరణ ఇచ్చిందని తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర విద్యాశాఖ ఉన్నత అధికారులకు, జిల్లా కలెక్టర్, విద్యాశాఖ అధికారి, మండల విద్యాధికారి ఇతర విద్యాశాఖాధికారులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.



## విశ్వకర్మ మహాసభ మరింత బలోపేతం కావాలి

### - డాక్టర్ అశ్విని కుమార్

### - ది అఖిల భారతీయ విశ్వకర్మ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడిగా నౌండ్ల సంతోష్ చారి నియామకం

**నస్పూర్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త**



తెలంగాణ రాష్ట్రంలో నౌండ్ల సంతోష్ చారి నాయకత్వంలో సంఘం మరింత అభివృద్ధి చెంది సమాజానికి విస్తృత సేవలు అందించాలని ది అఖిల భారతీయ విశ్వకర్మ మహాసభ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ అశ్విని కుమార్ ఆకాంక్షించారు. 1968లో స్థాపించబడి గత 58 సంవత్సరాలుగా దేశవ్యాప్తంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఈ మహాసభ తెలంగాణ రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా నౌండ్ల సంతోష్ చారిని నియమించింది. ఈ మేరకు జాతీయ నాయకుల బృందం రాంచి నుండి హైదరాబాద్‌కు విచ్చేసి సంతోష్ చారికి నియామక పత్రాన్ని అధికారికంగా అందజేసింది. విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సమాజం అభివృద్ధి కోసం జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు పొందిన ఈ సంఘం కొత్త అధ్యక్షుడి ఎంపిక కోసం గత కొన్ని నెలలుగా కసరత్తు చేసింది. గత అధ్యక్షుడి పదవీకాలం ముగియడంతో అనేక మంది అభ్యర్థులను పరిశీలించినట్లు నిర్వాహకులు తెలిపారు. సంతోష్ చారికి ఉన్న నిజాయితీ, సంఘ కార్యక్రమాల్లో ఆయన ప్రదర్శిస్తున్న చురుకుదనం, సమాజంతో ఉన్న బలమైన అనుబంధాన్ని పరిగణనలోకి తీసుకుని ఈ బాధ్యతలు అప్పగించినట్లు జాతీయ నాయకత్వం స్పష్టం చేసింది. మంచి వ్యక్తిత్వం కలిగిన నాయకుడిగా గుర్తింపు పొందిన సంతోష్ చారి నియామకం పట్ల సంఘం సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా విశ్వకర్మల సంక్షేమం కోసం మరిన్ని వినూత్న కార్యక్రమాలు చేపట్టనున్నట్లు సమాచారం. ఈ నియామక కార్యక్రమంలో జాతీయ నాయకులు, రాష్ట్ర స్థాయి ప్రతినిధులు పాల్గొని నూతన అధ్యక్షుడికి శుభాకాంక్షలు తెలిపారు.



ఆహ్వాన పత్రికను అందజేస్తున్న ఎస్సీ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు

## మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డిని ఆహ్వానించిన ఎస్సీ ఉద్యోగుల సంఘం

**భైంసా, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:**

భైంసా పట్టణానికి చెందిన విద్యావేత్త, సామాజిక కార్యకర్త జాడే నిలక్ష్మణ్ ఈ నెల 30న పదవీ విరమణ పొందుతున్న సందర్భంగా నిర్వహించే సన్మాన కార్యక్రమానికి రావాలని ఎస్సీ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు మాజీ ఎమ్మెల్యే జీ విఠల్ రెడ్డిని కోరారు. ఆదివారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సమాజ సేవలో ఎల్లప్పుడూ ముందుండే జాడే లక్ష్మణ్‌ను ఘనంగా సన్మానించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ఏప్రిల్ 30న మధ్యాహ్నం 2 గంటలకు భైంసాలోని బృందావన్ గార్డెన్‌లో జరగనుంది. ఈ వేడుకకు ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్, ప్రజా ట్రస్ట్ చైర్మన్ మోహన్ రావు పటేల్, జిల్లా విద్యాశాఖ అధికారి భోజన్న, మున్సిపల్ చైర్మన్ తుమ్మల దత్తాత్రి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనందరావు పటేల్ తదితరులు హాజరుకానున్నారు. ఈ సన్మాన కార్యక్రమానికి ఉపాధ్యాయ సంఘాలు, భారతీయ బౌద్ధ సభ, అంబేద్కర్ విగ్రహ స్థాపన కమిటీ ప్రతినిధులు, మున్సిపల్ కౌన్సిలర్లు, వివిధ సంఘాల నాయకులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు.

## బుధవార్ పేట్ స్మశాన వాటికలో మౌలిక సౌకర్యాలు కల్పించాలి

**నిర్మల్, ఏప్రిల్ 26, ప్రభాతవార్త:**

నిర్మల్ జిల్లా కేంద్రంలోని బుధవార్ పేట్ స్మశాన వాటికలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ బుధవార్ పేట్ మాల సంక్షేమ సంఘం ప్రతినిధులు ఆదివారం మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పల గణేష్ చక్రవర్తిని కలిసి వినతి పత్రం అందజేశారు. స్మశాన వాటిక చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణం, విద్యుత్ సౌకర్యం, బోర్‌వెల్ ఏర్పాటు, స్నానపు గదుల నిర్మాణం, దహన ప్లాట్‌ఫాంల మరమ్మతులు చేపట్టాలని వారు వైస్ చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. అంత్యక్రియలకు వచ్చే ప్రజలు సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. ఈ విన్నపంపై సానుకూలంగా స్పందించిన వైస్ చైర్మన్, స్మశాన వాటికలోని సమస్యలను త్వరలోనే పరిష్కరించి అవసరమైన వసతులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు ఎలుమల రాజేశ్వర్, ఏలుమల ముత్తన్న, ఎర్ర రవీందర్, దయగల గంగన్న, పేరుమల్ల రాజేశ్వర్, రాజలింగం, జ్ఞానేశ్వర్, చిన్నయ్య, బత్తుల రాజేశ్వర్, దేవర రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

